# అధికారిక కార్యక్రమమా.. కాంగ్రెస్ సభా?

- ప్రొటోకాల్ పాటించకపోవడం దురదృష్టకరం
- బీఆర్ఎస్ పాలనలో అన్ని పార్టీల నాయకులను గౌరవించుకున్నాం
- శాసనసభ స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తా
- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

నర్సాపూర్, డిసెంబర్ 10: ప్రభుత్వ పథకాల ప్రారంభోత్సవాలకు నిర్వహిస్తున్న కార్యక్రమం కాంగ్రెస్ సభను తలపిస్తున్నదని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి విమర్శించారు. ఆదివారం నర్సాపూర్‌లోని ప్రభుత్వ ఏరియా దవాఖానలో అదనపు కలెక్టర్ రమేశ్ ఆధ్వర్యంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ రూ.10 లక్షల పెంపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సునీతారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో మహిళా ఎమ్మెల్యే అని కూడా చూడకుండా ప్రొటోకాల్ పాటించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొటోకాల్ ప్రకారం తనను పిలవకుండా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కార్యక్రమాన్ని ప్రారంభించడం ఎంత వరకు సమంజసమని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ప్రారంభోత్సవంలో కాంగ్రెస్ నాయకులు ప్రొటోకాల్ పాటించకుండా స్టేజ్ పైన కూర్చోవడం ఏమిటని ప్రశ్నించారు. అగౌరపరిచేలా, అవమానించేలా కాంగ్రెస్ నాయకులు ప్రవర్తిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ పాలనలో ప్రొటోకాల్ ప్రకారం అన్ని పార్టీల నాయకులను గౌరవించుకున్నామని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రభుత్వానికి సహకరించే ఉద్దేశంతో ఉన్నామని, కాంగ్రెస్ నాయకులు మాత్రం అందుకు సహకరించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. దీనిపై శాసనసభ స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అశోక్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, సీనియర్ నాయకుడు సత్యంగౌడ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు వరం ఆరోగ్యశ్రీ పథకం



రాజీవ్ ఆరోగ్యశ్రీ పెంపు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, డిసెంబర్ 10: ఆరోగ్యశ్రీ పథకం పేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి తెలిపారు. ఆదివారం నర్సాపూర్‌లోని ప్రభుత్వ ఏరియా దవాఖానలో అదనపు కలెక్టర్ రమేశ్‌తో కలిసి ఎమ్మెల్యే రాజీవ్ ఆరోగ్యశ్రీ పెంపు పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజీవ్ ఆరోగ్యశ్రీ రూ.5 లక్షల నుంచి 10 లక్షల వరకు పెంచినట్లు తెలిపారు. ఈ పథకంతో ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఆరోగ్యశ్రీతో పేదలకు కార్పొరేట్ వైద్యం అందించినట్లు గుర్తుచేశారు. ప్రభుత్వానికి అన్ని విధాలా సహకరిస్తూ ఎలాంటి విబేధాలు లేకుండా ప్రజలకు సేవ చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, డీఎంహెచ్‌వో చందూనాయక్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఆర్డీవో శ్రీనివాసులు, జడ్పీటీసీ బాబ్యానాయక్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

### సునీతారెడ్డికి అభినందనల వెల్లువ



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కోనాపూర్ గ్రామస్తులు

కొల్చారం, డిసెంబర్ 10: నర్సాపూర్ ఎమ్మెల్యేగా ఎన్నికైన సునీతా లక్ష్మారెడ్డికి అభినందనలు కొనసాగుతున్నాయి. కొల్చారం మండలం కోనాపూర్ సర్పంచ్ కన్నారం రమేశ్, బీఆర్ఎస్ మండల యువత అధ్యక్షుడు సంతోష్‌రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు ఎమ్మెల్యే సునీతారెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. వారిలో మొగులయ్య, పౌల్, ఎల్లయ్య, పాపయ్య తదితరులు ఉన్నారు.

## కోయగుట్ట మల్లన్నస్వామికి పూజలు

మెదక్ రూరల్, డిసెంబర్ 10: మెదక్ మండలంలోని మంబోజిపల్లి శివారు కోయగుట్టపై కొలువు దీరిన మల్లికార్జున స్వామి ఆలయం భక్తులతో సందడిగా మారింది. కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం పూజారి మల్లన్న ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు, మహిళా భక్తులు ఒడిబియ్యం సమర్పించారు. స్వామికి ముడుపులు చెల్లించారు. అనంతరం అన్నదానం చేశారు.

## డబ్ల్యూపీఎల్ లీగ్‌లో గుజరాత్ జెయింట్స్ టీమ్‌కు త్రిష పూజిత



త్రిష పూజిత

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 10: ఉమెన్స్ ప్రీమియర్ లీగ్‌లో జిల్లా యువతి త్రిష పూజితను రూ.10 లక్షల బేస్ ప్రైజ్‌తో గుజరాత్ జెయింట్స్ టీమ్ ఎంచుకున్నది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన త్రిష పూజిత తల్లి కొండవీటి ఆరోగ్యం ఉపాధ్యాయురాలిగా మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని కొడపాక ప్రభుత్వ పాఠశాలలో పీజీ హెచ్‌ఎమ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తండ్రి కృష్ణారావు ఎల్రక్టానిక్ మీడియాలో జర్నలిస్ట్‌గా పని చేస్తున్నారు. త్రిష చిన్ననాటి నుంచే క్రికెట్‌పై మక్కువ చూపడంతో తల్లిదండ్రులు హైదరాబాద్‌లో క్రికెట్ కోచ్‌లు రాజశేఖర్, సలాం వద్ద శిక్షణనిప్పించారు. ఇండియన్ టీమ్ మాజీ కోచ్ శ్రీధర్ వద్ద బూస్ట్ ప్రోగ్రాంలో శిక్షణ పొందుతున్నది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సీనియర్ ఉమెన్స్ తరఫున లెఫ్ట్‌హ్యాండ్‌తో ఆడుతూ సత్తా చాటుతున్నది. త్రిష పలు మ్యాచ్‌ల్లో రాణించడంతో శనివారం జరిగిన ఉమెన్స్ ప్రీమియర్ లీగ్స్ రెండో సీజన్ వేలంలో గుజరాత్ జెయింట్స్ టీమ్ ఎంచుకున్నది. త్రిష గుజరాత్ జెయింట్స్ టీమ్ ఎంచుకోవడంపై పలువురు అభినందించారు.

## ఘనంగా సరస్వతీ దేవి యజ్ఞం

చిన్నశంకరంపేట, డిసెంబర్ 10: మండల కేంద్రంలోని స్థానిక వ్యాపారి రాచర్ల చిన్నరాములు జనాబాయి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో 484వ సరస్వతీ మహాయజ్ఞం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి అభిషేకం కుంకుమ పూజ, హోమం పూర్ణాహుతి, అన్నప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు, స్థానిక సర్పంచ్ రాజిరెడ్డి, జడ్పీటీసీ మాధవిరాజు, చేగుంట ఎంపీటీసీ వెంకటలక్ష్మి, రఘురాములు, ఉప సర్పంచ్ చిరంజీవి నాయకులు, శ్రీమాన్‌రెడ్డి, రాజు, స్వామి, యాదవరావు, రాజశేఖర్‌రెడ్డి, రాజాసింగ్, వెంకటేశం, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శివపార్వతుల కల్యాణం

మెదక్‌రూరల్, ఆగస్టు 10: హవేళీఘనపూర్ మండలంలోని ముత్తాయికోట సిద్ధిరామేశ్వరాలయంలో శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా హవేళీఘనపూర్ ఎంపీపీ శేరి నారాయణరెడ్డి దంపతులు కల్యాణోత్సవంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

## అన్ని సేవల కన్నా దేవుని సేవనే గొప్పది

### ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి




గంగారంలో చర్చిలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి,మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

చిలిపిచెడ్,డిసెంబర్ 10:అన్ని సేవల కన్నా దేవుని సేవనే గొప్ప అని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి,మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం చిలిపిచెడ్ మండలంలోని గంగారం గ్రామంలో దక్షిణ ఇండియా సంఘం మెదక్,చిట్కుల్ పాస్టరేట్ ఆధ్వర్యంలో నూతన గృహ ప్రతిష్ఠ మహోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే,మాజీ ఎమ్మెల్యే హాజరయ్యారు.అనంతరం వారికి పాస్టరేట్ కమిటీ సభ్యులు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆశీర్వదించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ అన్ని మతాలు,కులాలను గౌరవిస్తేనే బాగుంటదని అందరు కలిసిమెలిసి సోదరభావంతో ఉండాలన్నారు.మానవసేవే మాధవసేవ మనం నమ్ముకున్న ప్రజలకు సేవ చేస్తే ఎంతో పుణ్యం అని,మీ అందరి ఆశీర్వాదంతో నర్సాపూర్‌లో విజయం సాధించామన్నారు.అలాగే చర్చికి ప్రహరీ నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ పీ వినోదా దుర్గారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అశోక్‌రెడ్డి, వైస్ ఎంపీపీ విశ్వంభరస్వామి,పీఏసీఎస్ చైర్మన్ ధర్మారెడ్డి,బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు బెస్త లక్ష్మణ్,గంగారం గ్రామ సర్పంచ్ మమతాబాబు,ఎంపీటీసీ మల్లయ్య,ఆయా గ్రామాల సర్పంచులు మాంతప్ప, గోపాల్‌రెడ్డి, పరాశురాంరెడ్డి, యాదగిరి, భిక్షపతినాయక్, ఇస్తారి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, దుర్గారెడ్డి, శంకరయ్య, వెంకట్‌రెడ్డి, విజయమ్మ, సంగాగౌడ్, రాజేందర్‌రెడ్డి, హన్మంత్, గంగాధర్, వీరాస్వామి, విఠల్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఏడుపాయల్లో భక్తుల సందడి





పూజలు అందుకుంటున్న దుర్గామాత క్యూలో భక్తులు

పాపన్నపేట, డిసెంబర్ 10: ఏడుపాయల వనదుర్గా భవానీమాత సన్నిధిలో ఆదివారం పెద్దఎత్తున భక్తుల సందడి నెలకొన్నది. పలు ప్రాంతాల నుంచి ఏడుపాయల చేరుకున్న భక్తులు మంజీరా నదిలోని వివిధ పాయల్లో పుణ్యస్నానాలు చేసి దుర్గామాతను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం, కుంకుమార్చనలు, తలనీలాలు, బోనాలు సమర్పించి మొక్కుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చైర్మన్ సత్తెల్లి బాలాగౌడ్, ఆలయ ఈవో మోహన్‌రెడ్డి, సిబ్బంది తదితరులు ఏర్పాట్లు చేశారు. వేద పండితులు శంకరశర్మ, పార్థివ శర్మ, మురళీధర్ తదితరులు పూజలు చేశారు. ఎస్సై మహిపాల్‌రెడ్డి బందోబస్తు చర్యలు చేపట్టారు.

**నేడు ఏడుపాయలలో టెండర్లు**

ఏడుపాయల వరదుర్గా భవానీమాత క్షేత్రంలో ఏడాది పాటు వివిధ విక్రయాలు నిర్వహించేందుకు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం టెండర్లు నిర్వహించనున్నట్లు పాలక మండలి చైర్మన్ బాలాగౌడ్, ఈవో మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం కొబ్బరి కాయలు, తలనీలాలు, ఒడిబియ్యం, కొబ్బరి ముక్కలు, పూజా సామగ్రి, ఎంటర్‌టైన్మెంట్ ఎగ్జిబిషన్ తదితర విక్రయాలు చేసుకునే హక్కు పొందేందుకు ఓపెన్ టెండర్లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కొబ్బరి కాయల విక్రయానికి రూ.8 లక్షలు, ఒడిబియ్యం రూ.8 లక్షలు, జాతరలో తలనీలాలకు రూ.3 లక్షలు, కొబ్బరి ముక్కలు పోగు చేసుకునేందుకు రూ.3.50 లక్షలు, పూజాసామగ్రి రూ.8 లక్షలు, ఎంటర్‌టైన్మెంట్ ఎగ్జిబిషన్ కోసం రూ.లక్ష దరావత్తు సొమ్మును ఏడుపాయల దేవస్థానం పేరిట డీడీ తీసుకుని టెండర్లలో పాల్గొనాలన్నారు.

## నేటి నుంచి ప్రజావాణి షురూ

మెదక్, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నుంచి యథావిధిగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాజర్షి షా ఆదివారం తెలిపారు. శాసనసభ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో ప్రజావాణిని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. సోమవారం నుంచి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటల నుంచి ప్రజావాణి నిర్వహిస్తామన్నారు.

## ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక



రాజగోపాల్‌గౌడ్



పోచయ్య

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 10: ఎస్టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా రాజగోపాల్‌గౌడ్, పోచయ్య ఎన్నికయ్యారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవన్‌లో ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పర్వతరెడ్డి, సదానందంగౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. త్వరలోనే జిల్లా పూర్తిస్థాయి కమిటీని ప్రకటిస్తామని తెలిపారు. సమావేశంలో ఎస్టీయూ నాయకులు ప్రణీత్‌కుమార్, అశోక్, రాజు, శివప్రసాద్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయిలో కరాటే పోటీల్లో మిర్జాపల్లి ప్రతిభ

చిన్నశంకరంపేట, డిసెంబర్ 10: చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి కుంఫూ కరాటే పోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ, తృతీయ బహుమతులు గెలుపొందారు. ఆదివారం శంషాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి కుంఫూ, కరాటే పోటీల్లో మిర్జాపల్లి జడ్పీ పాఠశాలకు చెందిన పాండే ప్రసన్న రేణుకలు పాల్గొని తమ ప్రతిభను కనబరిచి తమ ప్రతిభను చాటారు. రాష్ట్రస్థాయిలో అంజలి పాండే ప్రథమ బహుమతి గెలుపొందగా, ప్రసన్న ద్వితీయ, రేణుక తృతీయ బహుమతి గెలుపొందారు.మరో విభాగంలో ఇదే పాఠశాలకు చెందిన కృతిక అక్షని పాల్గొని, రాష్ట్ర స్థాయిలో ద్వితీయ, అక్షిని తృతీయ బహుమతి గెలుపొందారు. క్రీడాకారులకు కరాటే మాస్టర్ కిషన్‌స్వామిలో కోచిలుగా వ్యవహరించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను హెచ్‌ఎం పుష్పవేణి, కరాటే మాస్టర్లు కిషన్‌స్వామి, సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ పీహెచ్ రమణ, మాజీ ఎంపీపీలు కృపావతి, అరుణ మాజీ ఉపసర్పంచ్ మనోజ్‌కుమార్, ఉపాధ్యాయులు గ్రామస్తులు అభినందించారు.



క్రీడాకారులు అంజలిపాండే, ప్రసన్న రేణుక